అందుబాటులో టమాటా..

- ధర నియంత్రణపై మహిళల హర్షం
- రైతు బజార్లకు క్యూ కడుతున్న జనం

సీతంపేట : బహిరంగ మార్కెట్లో ఆకాశాన్నంటిన టమాటా ధరల నియంత్రణకు ప్రభుత్వం చేపట్టిన చర్యలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితులు, డిమాండ్‌కు తగినట్టు సరుకు లభ్యం కాక ఇటు హోల్‌సేల్ మార్కెట్, అటు బహిరంగ మార్కెట్లో టమాటా ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. జూన్ రెండో వారం వరకు రైతుబజార్లలో కిలో రూ.20 విక్రయించిన టమాటా కేవలం రెండు వారాల వ్యవధిలో బహిరంగ మార్కెట్లో రూ.120లకు చేరుకుంది. రైతుబజార్లలో రూ.88లకు విక్రయించారు. హోల్ సేల్ మార్కెట్‌కు వస్తున్న సరుకులో మూడొంతులు హోటల్స్, చిరు వ్యాపారులకు వెళ్లిపోతోంది. దీంతో వినియోగదారులకు టమాటా లభ్యం కావడం లేదు. డిమాండ్ మేరకు అధిక ధరలకు వ్యాపారులు విక్రయించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్కెటింగ్ శాఖ అధికారులు టమాటా ధరల నియంత్రణకు చర్యలు చేపట్టారు. సబ్సిడీపై రైతు బజార్లలో విక్రయించాలని నిర్ణయించారు. విశాఖలోని రైతు బజార్లకు నిత్యం ఎంత సరకు అవసరమో గుర్తించి చిత్తూరు, మదనపల్లి, పలమనేరు ప్రాంతాల నుంచి టమాటాలు కొనుగోలు చేసి దిగుమతి చేస్తున్నారు. కిలో రూ.50 చొప్పున ఆధార్ కార్డు ఉన్న కుటుంబానికి ఒక కిలో టమాటాలు విక్రయిస్తున్నారు. ఈనెల రెండో తేదీన ఎంవీపీ, సీతమ్మధార, గోపాలపట్నం రైతుబజార్లలో 16 టన్నులు అంటే 16వేల కిలోల టమాటా రూ.50ల చొప్పున విక్రయించారు. ఆధార్‌కార్డు తెచ్చిన వినియోగదారునికి కిలో వంతున విక్రయించారు. మంగళవారం నగరంలో ఏడు ప్రధాన రైతు బజార్లలో 15 కిలోల టమాటాలు సబ్సిడీపై విక్రయించారు. నరసింహనగర్, పెందుర్తి, మద్రిపాలెం, ఎంవీపీ, గాజువాక, స్టీల్‌ప్లాంట్, మధురవాడ రైతుబజార్లలో సబ్సిడీపై కిలో రూ.50లకే విక్రయాలు జరిపారు. ధరల నియంత్రణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై వినియోగదారులు, ముఖ్యంగా మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నరసింహనగర్ రైతుబజార్‌లో...

నరసింహనగర్ రైతుబజార్‌లో మంగళవారం 100 క్రేట్ల టమాటాలు వచ్చాయి. సుమారు 2,500 కిలోల టమాటాలను నాలుగు డ్వాక్రా కౌంటర్లలో విక్రయించారు. ఉదయం 7 గంటలనుంచి విక్రయాలు ప్రారంభించగా 11 గంటలకే సరుకు అమ్ముడైంది. ఆధార్ కార్డు చూపించిన వారికి కిలో చొప్పున అమ్మకాలు చేశారు. మార్కెటింగ్‌శాఖ ఏడీఎం ఎస్కే యాసిన్, బజారు ఎస్టేట్ ఆఫీసర్ చినబాబు, సహాయకుడు సత్యనారాయణ సబ్సిడీ విక్రయాలను పర్యవేక్షించారు.


నరసింహనగర్ రైతుబజార్‌లో సబ్సిడీపై టమాటాలు విక్రయిస్తున్న ఏడీఎం ఎస్కే యాసిన్

సామాన్యులకు ఊరట



జూన్ మొదటి వారంలో కూడా ఆరు కేజీల టమాటా వంద రూపాయలకు అమ్మేవారు. మూడో వారం నుంచి ఒక్కసారిగా ధర పెరిగింది. బయట మార్కెట్లో కిలో రూ.120లకు అమ్ముతుంటే, ప్రభుత్వం వెంటనే స్పందించి సబ్సిడీపై కిలో రూ.50లకే విక్రయించడం ఊరటనిచ్చింది.

– పి. ఎర్రయ్యమ్మ, గృహిణి, అక్కయ్యపాలెం

ధరల నియంత్రణ చర్యలు భేష్



వర్షాలు లేకపోవడం, సరుకు దిగుమతికాక టమాటాకు గిరాకీ పెరిగింది. బయట మార్కెట్లో టమాట ధర రూ.120కు చేరింది. ఇటువంటి పరిస్థితుల్లో రైతుబజార్లలో కిలో రూ.50లకే సబ్సిడీపై విక్రయించడం బాగుంది. పచ్చిమిర్చి, అల్లం కూడా సబ్సిడీపై విక్రయించాలి.

– వి.రవణమ్మ, గృహిణి, కైలాసపురం

31 టన్నుల విక్రయాలు



నగరంలోని రైతుబజార్లలో రెండు రోజుల్లో 31 టన్నుల టమాటాలు సబ్సిడీపై రైతుబజార్లలో విక్రయించాం. ఈనెల 2న 16 టన్నులు, మంగళవారం మరో 15 టన్నులు టమాటాలు విక్రయించాం. మనిషికి కిలో చొప్పున అమ్మకాలు జరిపారు. వర్షాభావం, డిమాండ్‌కు తగినంత సరుకు లభ్యం కాక ధరలు ఒక్కసారిగా పెరిగాయి. మదనపల్లి, పలమనేరు ప్రాంతాల్లో మార్కెటింగ్ శాఖ సరుకు సేకరించి రైతుబజార్లలో సబ్సిడీపై విక్రయిస్తున్నాం. వారం రోజుల్లో ధరలు తగ్గే అవకాశం ఉంది.

– ఎస్కే యాసిన్, ఏడీఎం, మార్కెటింగ్ శాఖ

క్లుప్తంగా

46వ వార్డులో 'జగనన్న సురక్ష'


మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ సతీష్

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు తాటిచెట్లపాలెం పరిధి శాంతినగర్ సచివాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు ఆదేశాల మేరకు జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కటుమూరి సతీష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం కోసం పరితపిస్తున్నారన్నారు. ప్రభుత్వం నుంచి ఏ ధ్రువపత్రాలైనా ప్రజలకు నేరుగా అందే విధంగా 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలంటే ధ్రువీకరణ పత్రాలు ఉండాలన్నారు.

దుర్గమ్మకు కుంకుమ పూజలు


దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెం దుర్గానగర్‌లోని దుర్గమాంబ ఆలయంలో ఆషాడ మాస పాడ్యమి పురస్కరించుకుని మంగళవారం ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్య శర్మ ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీరామా సేవా సమాజం గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

సింహగిరి క్షేత్ర వైభవం గ్రంథావిష్కరణ


గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న దేవస్థానం ఈవో త్రినాథరావు తదితరులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి క్షేత్ర వైభవంపై నగరంలోని సీతమ్మధార ప్రాంతానికి చెందిన ఆధ్యాత్మిక రచయిత, ఏయు రిటైర్డ్ ప్రొఫెసర్ పెనుమత్స సోమరాజు రచించిన గ్రంథాన్ని మంగళవారం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆవిష్కరించారు. దేవాలయం స్థాపన, అభివృద్ధి చేసిన పాలకులు, పూజా కార్యక్రమాలకు లోటులేకుండా చూసిన మహాదాతలు, ఆధునిక కాలంలో వచ్చిన మార్పులు తదితర అంశాలను గ్రంథంలో పొందుపరిచినట్టు రచయిత సోమరాజు తెలిపారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ట్రస్ట్‌బోర్డు సభ్యులు దినేష్‌రాజ్, శ్రీనివాసరావు, శ్రీదేవివర్మ, కృష్ణమూర్తి పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

జూనోసిస్ వ్యాధులపై అవగాహన అవసరం

ఆరిలోవ: జూనోసిస్ వ్యాధులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని పశు వైద్య విభాగం చినగదిలి మండలం ఏడీ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. ఈ నెల 6న ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించుకుని ఆయన మంగళవారం 'సాక్షి'తో మాట్లాడారు. జూనోసిస్ డే సందర్భంగా తోటగరువులో పశువైద్యశాలతో పాటు చినగదిలి మండలంలో అన్ని పశువైద్యశాలల్లోను పెంపుడు కుక్కలకు ఉచిత వ్యాక్సిన్ వేయనున్నామన్నారు. కుక్కలకు రేబిస్ టీకా వేస్తే.. అవి మనుషులను కరిచినా ఎలాంటి ప్రమాదం ఉండదన్నారు. పిచ్చి కుక్క లాలాజలంలో రేబిస్ కారక వైరస్ ఉంటుందని, ఇది కరిచిన మనిషికి నరాలలోకి కుక్క లాలాజలం చేరి, అలా మెదడుకు వ్యాపిస్తుందని చెప్పారు. కరిచిన భాగాన్ని బట్టి వైరస్ మెదడుకు చేరడానికి 7 రోజుల నుంచి ఒక సంవత్సరం వరకు పడుతుందన్నారు. ఆ మధ్య కాలంలో మనిషి మరణించే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. అందుకే కుక్క కరిచిన వెంటనే రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. నెల రోజుల్లో తప్పనిసరిగా ఐదు డోసులు వేయాల్సి ఉంటుందన్నారు.

పోరాట యోధుడు 'అల్లూరి'


అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మేయర్ హరివెంకట కుమారి తదితరులు


49వ వార్డులో అల్లూరి జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున. చిత్రంలో మేయర్ హరివెంకట కుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తదితరులు

మురళీనగర్: బడుగు బలహీన వర్గాల ప్రజలకు సేవ చేయడం ద్వారా అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళులర్పించినట్టు అవుతుందని కలెక్టర్ ఏ.మల్లికార్జున అన్నారు. జీవీఎంసీ 49వ వార్డు బర్మా క్యాంప్ సమీపంలోని అల్లూరి సీతారామరాజునగర్‌లో విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అల్లూరి సీతారామరాజు 126వ జయంతి కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అల్లూరి సీతారామరాజు అణగారిన వర్గాల ప్రజల హక్కుల కోసం పోరాడి చరిత్రలో నిలిచారన్నారు. మేయర్ గొలగాని హరివెంకట కుమారి మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రజా సంక్షేమం వర్ధిల్లుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ పేదల చెంతకు నేరుగా పథకాలు చేర్చడం ద్వారా జగనన్న ప్రభుత్వం చరిత్ర సృష్టించిందన్నారు. ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు మాట్లాడుతూ పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేసి వారిని జీవన స్థితిగతులను మెరుగుపరచడం ద్వారా మహాత్మా గాంధీ కన్న కలలను జగనన్న నెరవేరుస్తున్నారని చెప్పారు. ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు నేరుగా అందిస్తున్నామన్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలో ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ముందుగా అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేకే రాజు వెయ్యి మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనిల్ కుమార్ రాజు, ఆళ్ల లీలావతి-శ్రీనివాస్, పి.ఉషశ్రీ, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, కేవీఎస్ శశికళ, కో–ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు క్షత్రియ సంక్షేమ సమితి విశాఖపట్నం చైర్మన్ ఎంఎస్ఎన్ రాజు, జోనల్ కమిషనర్ ఆర్.జి.వి కృష్ణ, వార్డు అధ్యక్షుడు నీలి రవి, పైడి రమణ, రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత, రాష్ట్ర నాయకులు పేడాడ రమణికుమారి, కిరణ్ రాజు, మాజీ కార్పొరేటర్ బులుసు జగదీశ్, డైరెక్టర్లు యస్.రవి కుమార్, పైడి శ్రీను, ఆఫ్రోజ్, ఐ.రవి కుమార్, క్షత్రియ సమితి ప్రతినిధులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి జయంతి

మురళీనగర్: విప్లవ జ్యోతి, మన్యం వీరుడు అల్లూరి సీతారామ రాజు జయంతిని మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్య్ర సమర యోధుల చరిత్రను తెలుసుకోవాలని డిప్లమా విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కాలేజీ అధ్యాపకులు పాల్గొన్నారు.

వాకర్స్ పార్కులో...

మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వాధ్యక్షులు రాళ్లపల్లి సత్యనాథం, కే.ద్వారకానాథ్, నిమ్మగడ్డ బుచ్చయ్య, సీహెచ్ కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు ఆదిభట్ల రామకృష్ణ, కార్యవర్గ సభ్యుడు టి.వెంకటరమణ, ఏ.వీ.సుబ్బారావు పాల్గొన్నారు.

డిస్ట్రిక్ట్–101 ఆధ్వర్యంలో...

వాకర్స్ డిస్ట్రిక్ట్–101 ఆధ్వర్యంలో మాధవధారలో నిర్వహించిన కార్యక్రమంలో మాధవధారలోని అల్లూరి విగ్రహానికి డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూత్ చైర్మన్ సీహెచ్ వంశీకృష్ణ వర్మ, కేబినెట్ కార్యదర్శి సీహెచ్ జ్యోతి, సీహెచ్ పద్మావతి పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

సీతంపేట: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సనపల తిరుపతిరావు, కొండపల్లి నూతన్, నడుపల్లి సతీష్, హారిక, శాన్వి, మౌనిక్ పాల్గొన్నారు.

51వ వార్డులో..

మద్రిపాలెం: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 126వ జయంతి వేడుక సందర్భంగా ఘన నివాళులర్పించారు. ఈ మేరకు 51వ వార్డు కళింగనగర్‌లోని ఈస్ట్‌పార్కులో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పైడి శ్రీను, దిడ్డి రమేష్, తిరుమలరావు, పొన్నాడ అప్పారావు మాస్టరు, కరిమిరెడ్డి శ్యామ్, పప్పల లక్ష్మణ్, ధర్మవతి, వరలక్ష్మి, రాణి, బాబూరావు, గణేష్, రంజిత్, సాంబ, రవి, భాస్కర్, రాజు తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు


అల్లూరికి నివాళులు అర్పిస్తున్న 101 గవర్నర్ శుభ

తెల్లదొరలను గడగడలాడించిన విప్లవ నేత అల్లూరి

సీతమ్మధార : విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈమేరకు సీతమ్మధారలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజుతో పాటు క్షత్రియ పెద్దలు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేకేరాజు మాట్లాడుతూ స్వాతంత్య్రోద్యమ చరిత్రలో తెల్లదొరలకు సింహస్వప్నంగా నిలిచిన పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు అని అన్నారు. స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపల్లి గోవింద్, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, ఆళ్ల లీలావతి, శశికళ, క్షత్రియ సేవా సమితి చైర్మన్ ఎంఎస్ఎన్‌రాజు, వైస్ ప్రెసిడెంట్ అల్లూరి బుల్లిబాబు, కె.శ్రీను, సెక్రటరీ డీఎస్పీ వర్మ, ఎంవీపీ కృష్ణంరాజు, హరివర్మ, గాదిరాజు నాగరాజు, ఎస్. శ్రీనివాసరాజు, రాజాం రాజు, కోశాధికారి శ్రీహరిరాజు, పలువురు వార్డు అధ్యక్షులు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తితో విశాఖ స్టీల్‌ను కాపాడుకుందాం

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తితో విశాఖ స్టీల్‌ప్లాంట్ ను కాపాడుకుందామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వికుమార్ పిలుపునిచ్చారు. అల్లూరి జయంతి సందర్భంగా సీతమ్మధారలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో సీపీఎం నాయకులు అనపర్తి అప్పారావు, పి.వెంకటరావు, కె.కుమారి, బాలకృష్ణ, జీవీ రమణ, నాయుడు, శివనాగేశ్వరరావు, పీవీ రమణ పాల్గొన్నారు.


వృద్ధులకు పండ్లు అందజేస్తున్న హేమంత్‌కుమార్


నివాళులు అర్పిస్తున్న 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ


సీతమ్మధారలోని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు


సీతమ్మధారలోని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

700 కేజీల పీడీఎస్ బియ్యం పట్టివేత

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. పట్టాభిరెడ్డి తోట ప్రాంతంలో దాసరి శంకరరావు ఇంట్లో అక్రమంగా ఉంచిన 700 కేజీల (14 బ్యాగ్)ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సర్కిల్–1 ఇన్‌స్పెక్టర్ చిట్టిరాజు బృందంతో కలిసి స్వాధీనం చేసుకున్నారు. శంకరరావును కంచరపాలెం పోలీసులకు అప్పగించారు.

ఘనంగా కుంచమాంబ మహోత్సవం


ప్రసాద వితరణ చేస్తున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు మాధవధార లోని కుంచమాంబ అమ్మవారి మహోత్సం వేడుక గా నిర్వహించారు. భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అమ్మవారిని వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, పేడాడ రమణికుమారి, కళా ఆస్పత్రి అధినేత కళా వెంకటరమణమూర్తి దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాదవితరణ గావించారు.

మురళీనగర్: మాధవదార కుంచుమాంబ అమ్మవారి వార్షిక జాతర సందర్భంగా మానవ సేవే మాధవ సేవ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారి ఉచిత ప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, అసోసియేషన్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్, మాధవ యువజన సమాజం అధ్యక్షుడు ఎస్.రామ్ గోపాల్, కన్వీనర్ పి.రామచంద్ర రావు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్జేడీ ఆకస్మిక తనిఖీలు

సీతమ్మధార : సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలో ఎన్ఎంసీహెచ్ హైస్కూల్‌లో విద్యా శాఖ ఆర్జేడీ జ్యోతి కుమారి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పదో తరగతి గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో తప్పిన విద్యార్థులు తిరిగి తరగతులకు వచ్చే ఏర్పాటు చేయాలని హెచ్.ఎం.ను ఆదేశించారు.

కేవీ-1లో 'బాలవాటిక-3'కు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

కంచరపాలెం: కేంద్రీయ విద్యాలయం–1 శ్రీవిజయ నగర్ 104 ఏరియా ఇండస్ట్రియల్ ఎస్టేట్ పాఠశాలలో 'బాలవాటిక–3' (యూకేజీ)కి గురువారం నుంచి https://no1 srivijayanagar. kvs. acin ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్ కోరారు. విద్యార్థి పుట్టిన తేదీ ధ్రువపత్రం, ఆధార్‌కార్డు, సర్వీస్ సర్టిఫికెట్, నివాస ధ్రువపత్రం దరఖాస్తులో పొందుపరచాలన్నారు. విద్యార్థి వయస్సు 5 ఏళ్లు నిండి ఆరేళ్ల లోపు ఉండాలన్నారు. దరఖాస్తుకు ఆఖరు తేదీ ఈ నెల 18వ తేదీ. 20న ఫలితాలు, 21 నుంచి 28వరకు అడ్మిషన్ ప్రక్రియ, 29న తరగతులు ప్రారంభమతాయని ఆయన తెలిపారు.

సైన్స్ కళాశాల విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ కొలువులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు సాధించారు. డిజిఫాక్ సంస్థలో ఏయూ స్టాటస్టిక్స్ విభాగం విద్యార్థులు ఐదుగురు, కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థి ఒకరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మంగళవారం సాయంత్రం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సమక్షంలో డిజిఫాక్ సంస్థ సీఈవో అమర్‌రాజ్ విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. ప్రారంభ వార్షిక వేతనంగా రూ.4లక్షలు అందుకోనున్నారు. వర్సిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్న డిజిఫాక్ సంస్థను వీసీ అభినందించారు.

అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులకు సత్కారం

మద్దిలపాలెం: ఏపీ పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ నాన్ టెక్నికల్ ఎంప్లాయీస్ రాష్ట్ర అధ్యక్షుడు మజ్జి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు డి.వి.ఎస్.ఎన్.రాజులను మంగళవారం హెచ్‌బీ కాలనీలోని కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ముఖ్య కార్యదర్శి వై.శ్రీలక్ష్మి సుముఖత వ్యక్తం చేసేలా కృషి చేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలుపుతూ సంఘం సభ్యులు ఈ సన్మానం చేశారు.

అల్లూరి జీవితంపై డాక్యుమెంటరీ


డాక్యుమెంటరీని ఆవిష్కరిస్తున్న కుమార్ తుహిన్. చిత్రంలో ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: అల్లూరి సీతారామరాజు జీవితంపై విశ్రాంత పోలీసు ఉన్నతాధికారి డాక్టర్ కె.సత్యనారాయణ అధ్యయనం చేసి తీర్చిదిద్దిన డాక్యుమెంటరీని ఏయూ వీసీ ప్రసాదరెడ్డి సమక్షంలో ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రీసెర్చ్(ఐసీసీఆర్) డైరెక్టర్ జనరల్ కుమార్ తుహిన్ ఆవిష్కరించారు. అల్లూరి జీవితంలో జరిగిన వివిధ సంఘటనలను సమగ్రంగా దీనిలో వివరించే ప్రయత్నం చేశారు. ఈ డాక్యుమెంటరీని యూట్యూబ్‌లో అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఆచార్య ఇ.ఎన్.ధనుంజయ రావు, ఎన్.నాగేశ్వర రావు పాల్గొన్నారు.

జీవీఎంసీ కమిషనర్ విస్తృత పర్యటన

దాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ మంగళవారం నగరంలో విస్తృత పర్యటన చేశారు. సిరిపురంలోని దత్ ఐల్యాండ్, బీచ్ రోడ్డులోని స్విమ్మింగ్ పూల్, ఎంవీపీ, హనుమంతవాక జంక్షన్, హెచ్‌బీ కాలనీ, ఎన్జీవోస్ కాలనీ, మురళీనగర్, తదితర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దత్ ఐల్యాండ్ ప్రాంతాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. బీచ్ రోడ్డులోని స్విమ్మింగ్ పూల్ పనులను పరిశీలించి, అధికారులకు తగు సూచనలు చేశారు. అనంతరం గిరి ప్రదక్షిణ మార్గంలో రోడ్లను పరిశీలించారు. పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రోడ్లపై పేపర్ ప్లేట్లు అతుక్కుపోయాయని, వాటిని నీటితో తడిపి హెయిర్ ప్రెషర్‌తో తొలగించాలని సూచించారు. రహదారులు మునుపటి వలే ఆకర్షణీయంగా ఉండేలా చూడాలని జోనల్ కమిషనర్లను ఆయన ఆదేశించారు.


దత్ ఐల్యాండ్ ప్రాంతంలో చేపట్టిన సుందరీకరణ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ